

వేతనం రికవరీ చేయాల్సిందే!

విధులకు గైర్హాజరు అయిన యూనియన్ నేత జీతం రికవరీ చేయాలని టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం నిర్ణయించింది. - 8లో ▸



ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్..

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
37^0 / 24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. ఎండ వేడి, ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

భద్రకాళి అమ్మవారికి గులాబీలతో అర్చన



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎరుపు రంగు గులాబీపూలతో అమ్మవారికి అర్చన చేశారు. ఉదయం అర్చకులు అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు. 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు తులసి అర్చన



హన్మకొండ కల్చరల్ : శ్రీరామనవమి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో సీతారాములకు లక్ష తులసిలతో అర్చన చేశారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన పూజా కార్యక్రమాల అనంతరం యాగశాలలో సుదర్శన హోమం నిర్వహించారు. ఈఓ అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

ఎంజీఎం ఓపీ కౌంటర్‌లో పనిచేయని ప్రింటర్లు



ఎంజీఎం : ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక సమస్య రోగులను ఇబ్బంది పెడుతోంది. శుక్రవారం ఔట్ పేషెంట్ విభాగం అడ్మిట్ కార్డు కౌంటర్‌లో ప్రింటర్లు పనిచేయలేదు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు గంటల తరబడి క్యూలో బారులుదీరారు. ఉక్కపోతతో నరకం చూశారు. వారి ఇబ్బందిని చూసి సిబ్బంది గత్యంతరం లేక మాన్యువల్‌గా ఓపీ చిట్టీలు రాసి ఇచ్చారు. దీనిపై ఓ రోగి కుటుంబ సభ్యుడు సిబ్బందిని ప్రశ్నించగా 'విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.. మేం ఏం చేస్తామంటూ' బదులిచ్చారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఖానాపురం: వైద్య సేవలందించడంలో రాష్ట్రంలో జిల్లా మధ్య స్థానంలో ఉందని, రానున్న రోజుల్లో ప్రథమ స్థానంలోకి తీసుకురావాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,775 పల్లె దవాఖానలు, సబ్‌సెంటర్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో అసంపూర్తిగా 30 ఉన్నాయని, వాటికి నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తిచేస్తామని తెలిపారు. ఆస్పత్రుల్లో కొన్ని చోట్ల సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయ లోపంతోపాటు అలసత్వం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీహెచ్ హెచ్చరించారు.

గురుకులాల్లో ప్రవేశ గడువు పొడిగింపు

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధిలోని నాలుగు మైనారిటీ గురుకులాల్లో(ఇంగ్లిష్ మీడియం)ప్రవేశం గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి డి.మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ అభ్యర్థులు 5వ తరగతి అలాగే 6, 7, 8, ఇంటర్ తరగతుల్లో(బ్యాక్‌లాగ్ ఖాళీలు) నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. నాన్ మైనార్టీలు(బీసీ, ఎస్సీ, ఎస్టీ) ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిమ్రీస్.జీటీవీ.ఇన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నాన్ మైనార్టీలకు డ్రా పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుందని, ఇతర వివరాలు, మైనార్టీలు నేరుగా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో లేదా జిల్లా పరిధి హనుమకొండ(జీ1) హంటర్‌రోడ్, హనుమకొండ(బీ1) ములుగు రోడ్డు పెద్దమ్మగడ్డ, కాజీపేట(బీ1) కడిపికొండ రాజీవ్ గృహకల్ప ఎదురుగా, పరకాల(బీ1) ఒగ్లాపూర్‌లోని గురుకులాల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

గతేడాది ఖిలావరంగల్ చిల్డ్రన్స్ పార్కులో పిల్లలతో కలిసి సరదాగా గడిపేందుకు శివనగర్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం వచ్చింది. పిల్లలతోపాటు తల్లి సైతం జారుడు బల్ల పైకి ఎక్కి జారింది. కానీ ఆ బల్ల అడుగున ఇసుక లేకపోవడంతో ఆమె కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి.

పదో తరగతి పరీక్షలు ముగిశాయి. పిల్లలకు వేసవి సెలవులు వచ్చాయి. ఎండలు దంచికొడుతున్నాయి. ఉపశమనం, ఆహ్లాదం కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని వారు ఉదయం, సాయంత్రం సరదాగా పిల్లలతో గడపాలనుకునే వారికి నగరంలోని పచ్చని పార్కులే ఆధారం. కొన్ని చోట్ల వీటి పరిస్థితి అధ్వానంగా ఉండగా.. మరికొన్ని చోట్ల పచ్చదనం పంచుతున్నాయి. కొన్ని చోట్ల పిల్లలు ఆడుకునే పరికరాలు ఉండగా.. మరికొన్ని చోట్ల శిథిల దశకు చేరుకున్నాయి. నగరంలోని పార్కుల పరిస్థితిని 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

ఆహ్లాదం.. అంతంతే!

పచ్చదనం కొంత మేరకే..!

- తుప్పుపట్టిన పిల్లల ఆట వస్తువులు
- శిథిలావస్థకు చేరిన పరికరాలు
- పార్కుల నిర్వహణపై బల్దియా అధికారుల నిర్లక్ష్యం



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో విరిగిపోయిన జారుడు బల్ల, ఇతర పరికరాలు

సాక్షి పరిశీలన

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మహానగరం పరిధిలో లే ఔట్, పార్కు స్థలాలు 391 ఉన్నాయి. అందులో 64 పార్కులను దశలవారీగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి, వడ్డేపల్లి బండ్‌లు, ఖిలా వరంగల్ కోటలో కాకతీయ పార్కులున్నాయి. బాలసముద్రం, ఎన్జీఓస్ కాలనీ, వడ్డేపల్లి శ్యామల దుర్గాదాస్ కాలనీ, పరిమళ కాలనీ, ప్రగతి నగర్‌లో చిల్డ్రన్స్ గార్డెన్లు ఉన్నాయి. ప్రత్యేకంగా పిల్లల కోసం ఆట వస్తువులు, పెద్దల కోసం ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి తెచ్చారు. ఇవే కాక.. డివిజన్లలో కాలనీ పార్కులు నిర్మించారు. బల్దియా ప్రధాన పార్కులు మినహా కాలనీ పార్కులపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని కాలనీ సంఘాలు ఇప్పటికే వీటి విషయమై ఫిర్యాదు చేసినా అధికారులు పెద్దగా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు న్నాయి. పార్కుల్లో సరైన లైటింగ్, భద్రత సిబ్బంది లేకపోవడం ప్రజలు కొంత భయాందోళనకు గురవుతున్నారు. పచ్చదనంతో కళకళలాడాల్సిన పలు పార్కులు మందు సీసాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఓపెన్ జిమ్‌లు, కుర్చీలు విరిగి దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్‌లో గ్రీన్ బడ్జెట్ పేరిట రూ.20 నుంచి రూ.30 కోట్ల నిధులు వెచ్చిస్తున్నా ఆ మేరకు సౌకర్యాలు కనిపించడంలేదు.

ప్రతిపాదన దశల్లో ఉన్నాయి..



కొన్ని కాలనీల పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, ఆట పరికరాలు దెబ్బతిన్నాయి. అభివృద్ధి కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారికి సమర్పించాం. గ్రీనరీ పెంచుతాం. సౌకర్యాలు కల్పిస్తాం.

– రమేశ్, బల్దియా హెచ్‌ఓ

కనిపించని ఆట వస్తువులు



మైదానంగా మారిన శ్రీరామ పార్క్

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 6వ డివిజన్, 8వ డివిజన్‌లో ఆహ్లాదం పంచడానికి, పిల్లలు ఆడుకోడానికి, వాకింగ్ చేయడానికి, స్వచ్ఛమైన గాలి పీల్చడానికి కనీసం ఒక్క పార్కు కూడా లేదు. ఎండాకాలం సెలవుల్లో పిల్లలు ఎక్కడ ఆడుకోవాలని బల్దియా అధికారులను డివిజన్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 54వ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ శ్రీరామ పార్కు మైదానంగా మారింది. కొంతమంది కబ్జా చేయడానికే మైదానంగా మార్చారని కాలనీవాసులు చెబుతున్నారు. అదే విధంగా 53వ డివిజన్ విజయగణపతి కాలనీ పార్కు కబ్జాలకు గురై కుచించుకుపోయింది. ఎలాంటి ఆట వస్తువులు లేకుండా బోసిపోయింది. 50వ డివిజన్ పోస్టల్ కాలనీ పార్కులో ఆట వస్తువులు లేకపోవడంతో పార్కులో పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు.



విజయగణపతి కాలనీ పార్కు



పోస్టల్ కాలనీ పార్కులో..

ఆటవస్తువులు ఏర్పాటు చేయాలి..



పార్కులో ఆట వస్తువుల్లేక పిల్లలు టీవీ, ఫోన్లకు ఎక్కువ బానిసలవుతున్నారు. పిల్లలు ఎంత ఆడుకుంటే అంత దృఢంగా తయారవుతారు. పిల్లలకు పార్కులో కనీస ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి.

– జి.కృష్ణారావు, పోస్టల్ కాలనీ

తుప్ప పట్టిన బెంచీలు.. తెగిన ఊయలలు..



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో విరిగిపోయిన ఆట వస్తువులు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో ఆహ్లాదం అటకెక్కింది. విరిగిన ఆట బొమ్మలు, తుప్పుపట్టిన జారుడు బల్లలు, తెగిన ఊయలలు దర్శనమిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం దాదాపు రూ.70 లక్షలతో పబ్లిక్ గార్డెన్‌లో సుందరీకరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఓపెన్ జిమ్, పచ్చదనం, ఆటబొమ్మలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో ఆటవస్తువులు పాడయ్యాయి. కొత్తవి అమర్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గార్డెన్‌లో పచ్చదనం కరువైంది. ఉద్యానవనాలను అత్యంత సుందరంగా, ఆహ్లాదంగా మారుస్తామన్న గ్రేటర్ వరంగల్ మహా నగరపాలక సంస్థ మాటలు కాగితాలకే పరిమితయ్యాయి.

ఘన చరిత్ర

నిజాం నవాబుల కాలంలో సుమారు 12 ఎకరాల సువిశాలమైన స్థలంలో నిర్మించిన పబ్లిక్ గార్డెన్‌లో నిత్యం వందల సంఖ్యలో జనం సేద తీరుతుంటారు. హనుమకొండ పట్టణ ప్రజలే కాదు వరంగల్, కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం హనుమకొండకు వచ్చే వారికి పబ్లిక్ గార్డెన్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో రైల్వే కార్మికుల కుటుంబాల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు మూడు పార్కులను ఏర్పాటు చేశారు. ఒకటి రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా.. మరొకటి డీజిల్ కాలనీలో ఉంది. ఈ రెండింటి నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో పని చేస్తున్న కార్మికులు, వారి పిల్లల కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు(కడిపికొండ ఫ్లై ఓవర్ కింద) అధ్వాన స్థితికి చేరింది. కొంత కాలం క్రితం వరకు ఈ పార్కు నిర్వహణ బాగానే ఉండేది. ఇటీవల పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా అయింది. అల్లరి మూకలు తిష్టవేసి దారి వెంట వచ్చిపోయే వారిని ఇబ్బందులు పెడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పార్కులో బీరు బాటిళ్లు, తాగి పడేసిన సిగరేట్ ముక్కలేఇందుకు నిదర్శనం.



రైల్వే ఎలక్ట్రిక్ షెడ్ వద్ద చిల్డ్రన్స్ పార్కు

నిర్వహణ అధ్వానం

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్స్ పార్కును గుండు చెరువు కట్టపై 18 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పార్కులో పచ్చని చెట్లు, అలంకరణ మొక్కలు ఉన్నప్పటికీ పిల్లలు ఆడుకునేందుకు సరైన ఆట వస్తువులు లేవు. దశాబ్ద కాలం క్రితం ఏర్పాటు చేసిన ఊయలలు, ఇనుప జారుడు బల్లలు తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి. ఊయలలు, జారుడు బల్లల వద్ద ఇసుక లేక పిల్లలు గాయాలపాలవుతున్నారు. పార్కులో మూత్రశాలల నిర్వహణ లేక దుర్వాసన వస్తోంది.

చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి చేయాలి..



సండే వచ్చిందంటే ఆహ్లాదంగా పిల్లలను తీసుకుని ఏకశిల చిల్డ్రన్స్ పార్కుకు వెళ్తుంటాం. పాత కాలం నాటి ఇనుప జారుడు బల్లలు ఊయలలు కనిపిస్తున్నాయి. వాటి కింద ఇసుక లేకపోవడంతో జారిపడి పిల్లలు గాయాలపావుతున్నారు. పార్కు అభివృద్ధితోపాటు ఊయలలు, జారుడు బల్లల వద్ద ఇసుకను పోయాలి. – కొండోజు పావని, విద్యానగర్, వరంగల్



తుప్ప పట్టిన జారుడు బల్ల

గంజాయి కేసుల్లో నేరస్తులను అరెస్ట్ చేయాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: గంజాయి కేసుల్లో రవాణాకు పాల్పడే వ్యక్తులతోపాటు వారికి సరుకు అందజేసే.. స్వీకరించే వ్యక్తులను అరెస్ట్ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఫిబ్రవరి నెలకు సంబంధించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పిలిపించడమే కాకుండా అధికారులు వారిని వ్యక్తిగతంగా కలుసుకుని పరిసరాల్లో ఉండే వారి నుంచి రౌడీషీటర్ల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీయాలన్నారు. ఆస్తి నేరాలకు సంబంధించి జైలు నుంచి విడుదలయ్యే నిందితుల సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. ఈనేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ పోలీసులతో పాటు పోలీస్‌స్టేషన్ అధికారులు కూడా నిర్వహించాలని తెలిపారు. స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై అధికారులు తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీలు చైతన్య, మనాన్‌భట్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

'బార్' ఎన్నికలకు భారీగా నామినేషన్లు

పలు స్థానాలు ఏకగ్రీవం

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల నూతన కార్యవర్గాలు 2025–26 ఎన్నికలకు శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి ఈ.ఆనంద్‌మోహన్, టి.జీవన్, వి.కోటేశ్వర్‌రావు, కె.రమేశ్, వి.సుధీర్ నామినేషన్లు దాఖలు చేయగా.. ప్రధాన కార్యదర్శి స్థానానికి బి.అనిల్‌కుమార్, ఆర్.నాగేంద్రాచారి, పి.ప్రవీణ్‌కుమార్, డి.రమాకాంత్, జి.శివ నామినేషన్లు దాఖలు చేసినట్లుగా ఎన్నికల అధికారులు సీహెచ్.చిదంబర్‌నాథ్, టి.శ్రీధర్ తెలిపారు. ఉపాధ్యక్ష స్థానానికి ఇద్దరు అభ్యర్థులు, జాయింట్ సెక్రటరీకి ముగ్గురు, మహిళా కార్యదర్శి స్థానానికి ఇద్దరు, క్రీడాకార్యదర్శులుగా ఇద్దరు, కోశాధికారిగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యవర్గ సభ్యులుగా ఆరుగురు, 20 ఏళ్ల కార్యవర్గ స్థానానికి ఇరువురు నామినేషన్లు దాఖలు చేశారు. లైబ్రరీ సెక్రటరీగా జి.కిశోర్‌కుమార్, 30 ఏళ్ల సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా ఎస్.శ్రీనివాస్, పదేళ్ల సీనియర్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా కె.నిర్మలా జ్యోతి, జూనియర్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా టి.అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

హనుమకొండలో...

హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి టి.కృష్ణమూర్తి, ఎ.మార్కండేయ, టి.నరేందర్, ఎం.రంజిత్, పి.సత్యనారాయణ, ఎస్.వెంకటరమణారెడ్డి నామినేషన్లు దాఖలు చేయగా.. ప్రధాన కార్యదర్శి స్థానానికి వి.నరేందర్, పి.నవీన్ కుమార్, కె.రవి, బి.శంకర్, ఆర్.వేణుగోపాల్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి కె.రమేశ్‌బాబు తెలిపారు. ఉపాధ్యక్ష స్థానానికి ముగ్గురు, మహిళా కార్యదర్శి స్థానానికి ఇద్దరు, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా ముగ్గురు, లైబ్రరీ కార్యదర్శిగా ఇద్దరు, కోశాధికారిగా ముగ్గురు, 30 సంవత్సరాల సీనియర్ కార్యవర్గ సభ్యులుగా ఇద్దరు, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురు, జూనియర్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఇరువురు నామినేషన్ల దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. జాయింట్ సెక్రటరీగా ఎంకే భీంరావ్‌జీ అంబేద్కర్, 20 ఏళ్ల సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా కె.ఆశీర్వాదం, సీనియర్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఇందిరా వేదకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కాగా.. ఈనెల 7న ఉపసంహరణలు, 11న (శుక్రవారం) ఎన్నికలు అనంతరం ఫలితాలు వెలువరించనున్నట్లు ఎన్నికల అధికారుల పేర్కొన్నారు.

జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

- టీఎన్ఎల్ఏ ఎస్.మారన్ వింగ్ ద్వారా మెయిల్
- బాంబ్ అండ్ డాగ్ స్క్వాడ్‌ల తనిఖీ

వరంగల్ లీగల్ : కోర్టు ప్రాంగణంలో ప్రమాదకర మందుపాతరలు ఏర్పాటు చేశాం.. మధ్యాహ్నం 2 గంటలకు పేలే ప్రమాదం ఉందని శుక్రవారం ఉదయం 7.11 గంటలకు జిల్లా కోర్టు అధికార మెయిల్‌కు ఓ సందేశం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు పోలీసులకు, హైకోర్టుకు సమాచారం అందించారు. స్పందించిన పోలీస్ యంత్రాంగం డాగ్ అండ్ బాంబ్ స్క్వాడ్‌ల ద్వారా తనిఖీలు చేపట్టారు. విషయం తెలిసి న్యాయమూర్తులు, న్యాయవాదులు కేసులకు సంబంధించి కోర్టుకు వచ్చిన కక్షిదారులను పంపించారు. తమిళనాడు లిబరేషన్ ఆర్మీ(టీఎన్ఎల్ఏ) ఎస్.మారన్–వింగ్ ద్వారా ఈ మెయిల్ వచ్చినట్లు ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసింది. సల్ఫర్ ఆక్సైడైజ్ ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్(ఐఈడీఎస్) పేలుడు పదార్థాలు ఏర్పాటు చేసినట్లు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన జర్నలిస్టు సువుక్కు శంకర్‌పై అమానవీయంగా ప్రవర్తించిన తీరు, అలాగే ఇటీవల రిమోట్ కంట్రోల్ సిస్టంను దుర్వినియోగం చేసి నివేత పేతురాజ్, ఉదయనిధి స్టాలిన్‌ల విషయాలను లీకేజీ చేసిన ఘటనలో డీఎంకే ప్రభుత్వంపై ప్రతీకారంగా ఈ పేలుడుకు పాల్పడుతున్నట్లు మెయిల్‌లో వివరించారు.



తనిఖీ చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు

కిట్స్ విద్యార్థికి 'గేట్'లో 298వ ర్యాంకు

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(నెట్‌వర్క్) విభాగానికి చెందిన విద్యార్థి బొబ్బల విశ్వప్రణవ్‌రెడ్డి గేట్‌లో ఆలిండియా 298 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వప్రణవ్‌రెడ్డిని రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, డాక్టర్ ఉప్పు శంకర్, డాక్టర్ ప్రభాకరాచారితో కలిసి అభినందించారు.



విశ్వ ప్రణవ్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తదితరులు

పడిపోతున్న భూగర్భ జలం

- వరంగల్ జిల్లా నగటు 6.32 మీటర్లు..
- హనుమకొండ జిల్లా నగటు 7.16 మీటర్లు..

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పెరిగిన భూగర్భ జలాలు.. నవంబర్ నుంచి క్రమేణా అడుగంటుతున్నాయి. హనుమకొండ జిల్లాలో డిసెంబర్ మాసాంతానికి 4.81 మీటర్లకు, జనవరి మాసాంతానికి 5.93 మీటర్ల లోతుకు, ఫిబ్రవరి మాసాంతానికి 6.30 మీటర్లకు, మార్చి మాసాంతానికి 7.16 మీటర్ల లోతుకు పడిపోయింది. వరంగల్ జిల్లాలో డిసెంబర్ మాసాంతానికి 4.18 మీటర్లు, జనవరి మాసాంతానికి 4.82, ఫిబ్రవరి 5.66, మార్చి మాసాంతానికి 6.32 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు అడుగంటాయి. అక్టోబర్ తర్వాత వర్షాలు లేకపోవడం, నవంబర్ నుంచి యాసంగి పనులు మొదలు కావడంతో భూగర్భ జలాల వినియోగం పెరిగింది. హనుమకొండ జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం 1,77,700 ఎకరాల్లో, వరంగల్ జిల్లాలో 2,05,277 ఎకరాల్లో సాగు చేశారు. వరి, మొక్కజొన్నతోపాటు ఇతర మెట్ట పంటలకు సాగునీటి వినియోగం పెరిగింది.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల ధర్నా

హన్మకొండ: దశాబ్దాల కాలంగా రక్తం చెమటగా మార్చి పనిచేసి జీవితాన్ని ధారబోసి ఉద్యోగ విరమణ చేసిన తమపై యాజమాన్యం, ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదదని.. సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన హనుమకొండ, వరంగల్–2 డిపోల ఎదుట ధర్నా చేశారు. కార్మికులు మాట్లాడుతూ వయస్సులో ఉన్నప్పుడు సంస్థకు సేవ చేసిన తమకు కనీస పెన్షన్ లేదని, జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించలేదు.. గ్రాట్యుటీ ఇవ్వడం లేదు.. డిపాజిట్లపై వడ్డీ చెల్లించడం లేదని వాపోయారు. 2022 ఏప్రిల్ నుంచి టెర్మినల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఆర్‌పీఎస్ 2017 ఎరియర్స్, ఈపీఎస్‌కు పీఎఫ్ హయ్యర్ పెన్షన్, 2021 వేతన ఒప్పందం చేసి ఎరియర్స్ చెల్లించాలన్నారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగి, స్పౌజ్‌కు సూపర్ లగ్జరీ బస్ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రిటైర్డ్ కార్మికులు కేఎస్.నారాయణ, ఎస్.ఎస్.చారి, ఎస్.వై.గిరి, టి.సునీత, యాదగిరి, సీహెచ్ సోమయ్య, బీయూ.చారి, వై.శ్రీనివాస్, సాజిద్, వై.గిరి. సమ్మయ్య పాల్గొన్నారు.



వరంగల్–2 డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు

డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి..

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ బీహెచ్‌ఎం అండ్ సి.టి కోర్సుల్లో మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షల ఫీజు చెల్లింపు నోటిఫికేషన్‌ను శుక్రవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య విడుదల చేశారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 11 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఆయా విద్యార్థులు తమ కళాశాలల్లో సంప్రదించాలని వారు సూచించారు. అలాగే సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లోనూ వివరాలుంటాయని పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు ఉంటాయని వివరించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్ఎల్బీ 5 ఏళ్ల లా కోర్సులో తాత్కాలిక పద్ధతిన వివిధ సబ్జెక్టుల్లో టీచింగ్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోషియాలజీ (1), పొలిటికల్ సైన్స్(1), లా సబ్జెక్టుల్లో బోధనకు(ఆరు) వేకెన్సీలు ఉన్నట్లు తెలిపారు. ఎల్ఎల్ఎం/ఎంఏ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. నెట్/సెట్ పాస్ లేదా పీహెచ్డీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ లా కాలేజీలో ఈనెల 8వ తేదీ వరకు అందజేయాలని పేర్కొన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు టీచింగ్ అనుభవం సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇది పార్ట్టైం నియామకం కాదని, వన్టైం సింగిల్ అరెంజ్మెంటుగా తాత్కాలిక పద్ధతిలో(2024–25)విద్యాసంవత్సరానికే (సెమిస్టర్) నియామకని పేర్కొన్నారు. ఒక సబ్జెక్టులో పేపర్వైజ్ ఐదు యూనిట్స్ సిలబస్ బోధిస్తే రెమ్యూనరేషన్ రూ.20వేలు చెల్లిస్తారని సుదర్శన్ తెలిపారు.

టీజీఆర్జేసీకి..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గురుకుల విద్యాలయ జూనియర్ కళాశాలల్లో 2025–26లో ప్రవేశాలకు టీజీఆర్జేసీ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని టీజీఆర్జేసీ హసన్పర్తి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ఇందుమతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈఏడాది మార్చి–ఏప్రిల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు http:tgrjc.cgg.govt. inలో చూడాలని తెలిపారు. ఇతర వివరాలకు 040–2473 4899, 98665 59727 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న డీ వాటరింగ్



ధర్మసాగర్ : ధర్మసాగర్ రిజర్వాయర్కు సమీపంలో 5 రోజుల క్రితం ప్యాకేజీ 3కు సంబంధించిన దేవాదుల టన్నెల్ లీకేజీ సంఘటనలో శుక్రవారం సాయంత్రం వరకూ డీ వాటరింగ్ కొనసాగింది. గత 5 రోజులుగా లీకేజీని కనుగొనేందుకు అధికారులు అన్వేషిస్తున్నారు. గురువారం ట్రయల్ రన్ చేసినా సీపేజీ తప్ప పెద్ద లీకేజీలు కనిపించలేదు. దీంతో(వాటర్ పాలింగ్) రిజర్వాయర్లో నీరు పంపింగ్ జరిగే దగ్గరి నుంచి మూడు మోటార్లు, లీకేజీ అయిన దగ్గరి నుంచి మరో పెద్ద మోటారు ఏర్పాటు చేసి డీ వాటరింగ్ చేస్తున్నారు. నీరు తగ్గకపోవడంతో డీ వాటరింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు లేదా శనివారం వరకు డీ వాటరింగ్ పూర్తి చేసి లీకేజీలను కనుక్కుంటామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
డ్రెస్డ్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

వేతనం రికవరీ చేయాల్సిందే!

విధులకు గైర్హాజరైన యూనియన్ నేత జీతం రికవరీకి ఎన్పీడీసీఎల్ నిర్ణయం

- విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులకు ఝలక్
- ఆదిలాబాద్ జిల్లాలో ఓ యూనియన్ నేత, జీతం చెల్లించిన డీఈ జీతం రికవరీ
- మెమో జారీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ఇప్పటికైనా నాయకుల్లో మార్పు వచ్చేనా?



హన్మకొండ : టీజీఎన్పీడీసీఎల్లో ఓ ఉద్యోగ సంఘం నాయకుడు విధుల హాజరు నుంచి పూర్తి స్థాయి మినహాయింపు లేకున్నా.. విధులకు హాజరు కాకున్నా పూర్తి స్థాయి వేతనం పొందాడు. అలాగే, సదరు సంఘ నాయకుడు విధులకు గైర్హాజరైనా ఓ డీఈ.. జీతం ఇచ్చాడు. దీనిపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి నివేదిక అందించారు. దీనిని పరిశీలించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి జీతం రికవరీ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకుల్లో కలకలం సృష్టించింది. ఝలక్ ఇచ్చింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ నాయకుడు ఎలాంటి ఫుల్ టైమ్ అనుమతి లేకుండా విధులకు హాజరు కాలేదని, అయినా అతడికి వేతనం చెల్లించడంతో సంస్థకు ఆర్థిక నష్టం చేకూరిందని పేర్కొంటూ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జీతం మొత్తం రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హెచ్ఆర్డీ విభాగం మార్చి 22, 2025 తేదీతో మెమో జారీ చేసింది.

2023లోనే రద్దయిన విధుల నుంచి మినహాయింపు..

విద్యుత్ శాఖలో యూనియన్కు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తికి ఆ యూనియన్ కార్యకలాపాల నిమిత్తం సమావేశాలకు హాజరయ్యేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయి మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ అటూ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్ సంస్థలు ఫుల్టైమ్ అనుమతి ఇచ్చేవి. ఈ విధానం 2022 డిసెంబర్ వరకు కొనసాగింది. 2023 సంవత్సరం నుంచి రద్దు చేశారు. 2022 వరకు రాష్ట్ర, కంపెనీ, జిల్లా స్థాయి ముఖ్య నాయకులకు ఫుల్టైమ్ అనుమతి ఉండేది. అయితే 2022 డిసెంబర్ 16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ సమావేశంలో నాలుగు విద్యుత్ సంస్థలు జెన్కో, ట్రాన్స్ కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదేని కంపెనీ నుంచైనా యూనియన్కు ఒక్కరు మాత్రమే ఫుల్ టైమ్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించాయి. దీంతో రాష్ట్ర, కంపెనీ, సర్కిల్ వారీగా గతంలో తీసుకున్న ఫుల్టైమ్ విధానం రద్దయింది. ఈ ఒక్కరిలో కూడా వర్క్మెన్ క్యాడర్కు సంబంధించిన ఉద్యోగి అయి ఉండాలని నిబంధన పెట్టారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్లో జేఎల్ఎం నుంచి ఫోర్మెన్ వరకు, ప్రావెన్షియల్ విభాగంలో అటెండర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వర్క్మెన్ క్యాడర్లోకి వస్తారు. అయితే పలు యూనియన్లకు వర్క్మెన్ పై స్థాయి క్యాడర్ కలిగి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాష్ట్ర స్థాయిలో కీలక పదవుల్లో ఉన్నారు. వీరితో పాటు సర్కిల్ స్థాయిలో పలువురు యూనియన్ల నాయకులు 2022 వరకు ఫుల్టైమ్ అనుమతి పొందారు.

యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు..

ఈ నిర్ణయం విద్యుత్ యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫుల్టైమ్ విధానంలో మార్పులు చేర్పులు జరగకముందే గైర్హాజర్పై తీవ్రంగా స్పందించిన యాజమాన్యం ఇక ముందు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆందోళనలో యూనియన్ నాయకులున్నారు.

పాత అలవాటు ఇప్పటికీ కొనసాగింపు..

ఫుల్టైమ్లో నియంత్రణ విధించడంతో పాత అలవాటు ఇప్పటికీ కొందరు నాయకులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో యూనియన్ నాయకుల హాజరుపై ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం అప్పుడప్పుడు విచారణ చేపడుతోంది. కంపెనీ, సర్కిల్ స్థాయికి చెందిన యూనియన్ నాయకులు కొందరు ఇప్పటికీ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆదిలాబాద్ సర్కిల్లో జేఏఓ పి.గోపాల్ రావు 2019లో ఫుల్టైమ్ మినహాయింపు పొందాడు. అయితే ఆ తర్వాత కూడా 2020 జనవరి 1 నుంచి జూలై 30, 2021 వరకు ఎలాంటి అనుమతి, డ్యూటీ నుంచి మినహాయింపు లేకుండానే విధులకు గైర్హాజర్ అయ్యారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి నివేదిక అందించారు. పరిశీలించిన యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి రూ.31,25,715 రికవరీ చేయాలని నిర్ణయంతో పాటు ఒక వార్షిక ఇంక్రిమెంట్ నిలిపివేస్తూ మెమో జారీ చేసింది. ఇందులో సెలవులు రూపేణ రూ.12,01,815 మినహాయించి మిగతా రూ.19,23,900ను సంబంధిత ఉద్యోగి పి.గోపాల్ రావుతో పాటు, విధులకు గైర్హాజరైన జీతం ఇచ్చినందుకు అప్పటి డీఈ నుంచి రికవరీ చేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇద్దరి నుంచి రూ.9,61,950 చొప్పున రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయించింది.

ఎట్టకేలకు 'విజిలెన్స్' విచారణ

- ఫిర్యాదుదారుడికి మాత్రమే సమాచారం
- చాటింపు వేయలేదు.. కూలీలు రాలేదు

హసన్పర్తి: హసన్పర్తి మండలం అన్నాసాగరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. 'వాయిదాలతో కాలయాపన' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విజిలెన్స్ అధికారులు స్పందించారు. ఈమేరకు అన్నాసాగరం జీపీలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా కూలీలు ఎక్కడ? అని విజిలెన్స్ అధికారి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తనకు మాత్రమే సమాచారం ఇచ్చారని ఫిర్యాదుదారుడు మధుకర్ విజిలెన్స్ అధికారికి చెప్పాడు. విచారణ ఉన్నట్లు చాటింపు వేయలేదు. అలాంటప్పుడు కూలీలు ఎలా వస్తారని అడిగాడు. విచారణ జరగకుండా అన్ని ప్రయత్నాలు చేశారని ఫిర్యాదుదారుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చాడు. అవినీతి అధికారులను కాపాడేందుకు విచారణ సాగకుండా ఒత్తిడి తీసుకొస్తున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపించాడు.



విచారిస్తున్న విజిలెన్స్ అధికారి

చనిపోయిన వారు పనులు చేశారట!

ఐదుగురు వ్యక్తులు చనిపోయారు. వారి పేర్లపై డబ్బులు డ్రా చేశారని ఫిర్యాదుదారుడు విచారణాధికారి ఎదుట చెప్పాడు. తాను పని చేయకున్నారు.. తనపై కూడా ఉపాధి పని చేసినట్లు డబ్బులు తీసుకున్నారని తెలిపాడు. ఫీల్డ్ అసిస్టెంట్ పేరిట కూడా పని చేసినట్లు డబ్బులు డ్రా చేశాడని విచారణాధికారికి వివరించాడు. ఇందుకు కావాల్సిన ఆధారాలు అందజేశాడు. ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కల్పన, టీఏ సృజన పాల్గొన్నారు.

రైతు సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



దీక్షలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హన్మకొండ: రైతు సమస్యలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణ మాఫీ చేయడంలో విఫలమైందని విమర్శించారు. యాసంగి పంట కాలం పూర్తయి.. వానాకాలం సాగు సమీపిస్తున్నా ఇప్పటికీ యాసంగి కాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి రూ.6 వేలు క్రమం తప్పకుండా ఇస్తోందని చెప్పిన ఆయన.. కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అనేక వాగ్దానాలు చేసి ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నదని విమర్శించారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎంత మందికి రుణ మాఫీ జరిగిందో తెలియజేస్తూ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు చేయడంతోపాటు రైతు భరోసా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, వరంగల్, జేఎస్‌భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, నిశిధర్ రెడ్డి, సిరికొండ బలరాం, సోడా రమేష్, నాయకులు వన్నాల శ్రీరాములు, రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, మల్లాడి తిరుపతిరెడ్డి, రత్నం సతీష్, గోగుల రాణా ప్రతాపరెడ్డి, బైరి నాగరాజు, పుల్యాల రవీందర్ రెడ్డి, ఎం.విష్ణు, డాక్టర్ కాళీ ప్రసాద్ పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి కృషిచేయాలి

- సయ్యద్ మతిన్ అహ్మద్

విద్యారణ్యపురి: దేశ ఐక్యతను పెంపొందించే జాతీయ భాష హిందీ అభివృద్ధికి కృషిచేయాలని రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణామండలి (ఎస్‌సీఈఆర్‌టీ) హిందీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ మతిన్ అహ్మద్ అన్నారు. హనుమకొండ జిల్లాలో పదోన్నతి పొందిన హిందీ స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి హిందీ భాష చదవడం, రాయడంతోపాటు అనర్గళంగా మాట్లాడే విధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు శిక్షణ పొందుతూ విద్యార్థులకు వినూత్నంగా బోధించాలన్నారు. అనంతరం ఈ సంవత్సరం ఉద్యోగ విరమణ పొందుతున్న హిందీ ఉపాధ్యాయులు, మ్యూచువల్ బదిలీలపై వేరే జిల్లాలకు వెళ్తున్న హిందీ ఉపాధ్యాయులు, కోర్సు డైరెక్టర్ జగన్, హిందీ రిసోర్స్‌పర్సన్ ఉపాధ్యాయులు గౌస్‌పాషా, భూమ్‌లింగం రెహమాన్, తిరుపతయ్యను హిందీ భాషా ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హిందీ బాషా ఉపాధ్యాయులు ఎఫ్ఎస్ అలీ, లక్ష్మణసుధాకర్, అనురాధ, చిత్రలేఖ, శ్రీదేవి, ముజీబ్‌పాషా పాల్గొన్నారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయం

- సీజ్ చేసిన పోలీసులు





పోలీసులు సీజ్ చేసిన కూల్‌డ్రింక్స్

కమలాపూర్: కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఓ కిరాణా షాపు యజమాని ఫిర్యాదుతో పోలీసులు ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి కాలం చెల్లిన పలు రకాల కూల్‌డ్రింక్స్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కిరాణా షాపు యజమాని, కొనుగోలుదారులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌కు చెందిన కెంసారపు తిరుపతి అనే కిరాణా షాపు నిర్వాహకుడికి కమలాపూర్‌లోని కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకులు మౌటం ఓంప్రకాష్–హేమలత గత నెల 21న కొన్ని 200 ఎంఎల్ మాజా బాటిళ్లు సరఫరా చేశారు. వాటిని తిరుపతి కొందరు కొనుగోలుదారులకు విక్రయించగా డేట్ ఎక్స్‌పైర్ అయినట్లుగా వారు గుర్తించారు. దీంతో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ ఎందుకు విక్రయిస్తున్నావని, ఇవి తాగితే తమ ప్రాణాలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ తిరుపతిని కొనుగోలుదారులు నిలదీశారు. దీంతో తిరుపతి తాను ఎక్స్‌పైర్ డేట్‌ను గమనించలేదని చెప్పానే వెంటనే ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ ఎందుకిచ్చారని, వాటిని తీసుకెళ్లి వాటి స్థానంలో వేరే కూల్‌డ్రింక్స్ ఇవ్వాలని కోరాడు. దీంతో వారు తమకేమీ సంబంధం లేదని, కంపెనీ వాళ్లకు వాపస్ ఇచ్చుకోండంటూ దురుసుగా మాట్లాడటమే కాకుండా నానా దుర్భాషలాడారని తిరుపతి ఆరోపించాడు. అంతే కాకుండా కంపెనీ వాళ్లు ఇచ్చిన ఫ్రిజ్ బయట పెడితే తీసుకెళ్తామని ఫోన్లోనే వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులు వేచి చూసిన తిరుపతి గత నెల 31న కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 2న పోలీసులు కమలాపూర్‌లోని కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి గోదాంలో నిల్వ ఉన్న కాలం చెల్లిన పలు రకాల కూల్‌డ్రింక్స్ తోపాటు వాటర్, సోడా బాటిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రూ.15,483 విలువైన కూల్‌డ్రింక్స్ సీజ్ చేసి, ఏజెన్సీ నిర్వాహకుడు ఓం ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రారావు తెలిపారు. కాగా, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, వారి అండదండలతోనే ఈ తతంగమంతా నడుస్తోందని, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడికి అరుదైన గుండె శస్త్రచికిత్స



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ షఫీ

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో 77 ఏళ్ల వృద్ధుడికి వైద్యులు అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను వైద్యుడు షఫీ వెల్లడించారు. వరంగల్‌కు చెందిన వృద్ధుడు మామిడిపల్లి ముకుందాచారి ఇటీవల తీవ్రమైన గుండె నొప్పితో ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్, రైట్ కరోనరీ ఆర్టరీ, లెఫ్ట్ సర్కమ్ ఫ్లెక్స్ ఆర్టరీ, యాంటీరియర్ డిసెండింగ్ ఆర్టరీ, స్టెనోసిస్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈక్రమంలో డ్రగ్ ఎలుటింగ్ స్టెంట్, డ్రగ్ ఎలుటింగ్ బెలూన్ గుండె శస్త్రచికిత్స నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం వృద్ధుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు షఫీ వెల్లడించారు.

సస్పెన్షన్ ఎత్తివేత?

వరంగల్: వరంగల్ రీజియన్ పరిధిలో సీసీఐ కొనుగోళ్లలో నిబంధనలకు విరుద్ధంగా టీఆర్‌లు జారీ చేసిన మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్‌ను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఎత్తివేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. టీఆర్‌ల జారీ చేసిన వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించడంతో పునరాలోచన చేసినట్లు సమాచారం. ఈమేరకు మార్కెట్ కార్యదర్శులకు ఎక్కడి వారికి అక్కడే పోస్టింగ్‌లు ఇస్తారని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా పూర్తి వివరాలు తమకు తెలియదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Study Hall Rs. 1000/- Seat P.M. 1st 30 seats Rs. 500/- this month offer. Registration Time : 10 a.m. to 5 p.m. Inspire Professionals, 2nd Floor, Mayuri Plaza, Kishanpura, HNK - 93916 22073 [M-12940]

REAL ESTATE

PLOT FOR SALE

వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో KUDA Approved Layout Plots 6999/- గజం మాత్రమే EMI సౌకర్యం కలదు. సంప్ర॥ 9573689941. [WA-7559]

SERVICES

CHANGE OF NAME

I, AKHILA RAMACHANDROJU, G/o. Shyamkumar, Address: 12-2-150, Pinnavari Street, Warangal, Telangana 506002 has changed my Mother Name from VASUDHA to RAMACHANDROJU SPANDANA & Guardian Name from SHYAMKUMAR to VADLURI DURGA DEVI, vide: Affidavit No. 4590, Dated: 27-05-2023 before Notary by I. HARINATH (29-05-2023). [WA-2352]

మహిళలకు శుభవార్త

శ్రీశైలి బ్యూటీపార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో నేర్పించబడును టైలరింగ్, మగ్గం వర్క్స్, మెహిందీ 5 వేలకే with సర్టిఫికేట్‌తో నేర్పబడును. 9989060668. [W-1265082]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

ఓరుగల్లు ఫ్యూయల్ (పెట్రోలు పంపు)లో వెహికల్ల టైర్లలో గాలిపెట్టుటకు అబ్బాయి కావలెను. (నైట్ డ్యూటీ) సంప్రదించండి: 9390432296. హంటర్ రోడ్, WGL-HNK. [WA-7558]

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మల్లేశ్ (ఫైల్)

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన ఆవుల మల్లేశ్(30) రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని మంగళ సీడ్స్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే పనికి వెళ్లి తన ద్విచక్రవాహనంపై ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా తిరిగి వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ రోడ్డు సమీపంలో వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. మల్లేశ్ తల, గొంతు, కుడికాలుకు బలమైన గాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మల్లేశ్ భార్య ఆవుల మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

బాసరలో శాయంపేట యువకుడి మృతి



మణికంఠ(ఫైల్)

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బండారి మణికంఠ(19) బాసరలోని శ్రీ వేదభారతి పాఠశాలలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మణికంఠ బాసరలోని శ్రీవేదభారతి పాఠశాలలో రెండు సంవత్సరాలుగా చదువుతున్నాడు. మణికంఠ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడని శుక్రవారం మధ్యాహ్నం బాసరలోని వేద పాఠశాల సిబ్బంది మణికంఠ తండ్రి బండారి రాజేందర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో రాజేందర్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. మణికంఠను ఎవరో కావాలని హత్య చేసి విద్యుత్ షాక్‌గా చిత్రీకరిస్తున్నారని తన కుమారుడి మృతిపై అధికారులు దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని రాజేందర్ కోరారు.

గణిత, విజ్ఞాన శాస్త్రాలపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు గణిత, విజ్ఞాన శాస్త్రాలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా స్థాయి గణిత, విజ్ఞాన శాస్త్ర క్విజ్, ప్రతిభాన్వేషణ, సైన్స్ సెమినార్‌లో పోటీలను హనుమకొండ లష్కర్ బజార్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, సంధ్యారాణి, ఉమ, జగన్నాథం, భాస్కర్, రమేశ్, వాసు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిటైర్డ్ ఉద్యోగుల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రద్దులో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంపీవీ.ప్రసాద్‌ను తొలగించి రామ్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు, తదితరులు

పరకాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు అన్నారు. టెక్స్‌టైల్ పార్కులో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్‌బాబు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. పరకాల మున్సిపల్ సమావేశమందిరంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌లోని ఇండస్ట్రీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు స్కిల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా స్థానికులకు నైపుణ్యం కల్పించి నియమించుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ లే అవుట్‌లో పట్టాలిచ్చిన 863 మంది రైతులకు వారి అభ్యర్థన మేరకు 50 గజాల నుంచి 75 గజాలు అందించేందుకు టీజీఐఐసీ ద్వారా అదనంగా రెండు ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. తిరిగి లేఅవుట్ ప్లాట్లు చేసి రాజీవ్ గాంధీ టౌన్ షిప్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ జీడీపీ పథకం ద్వారా రూ.10.10 కోట్ల వ్యయంతో చేపట్టిన కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్స్, మంచినీటి సరఫరా, సంప్, పరిపాలన భవన నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయని, జూలై 2025 నాటికి పూర్తవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

గంజాయి, గుడుంబా నివారణకు చర్యలు

టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఉందని అలాంటి కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కోరారు.

ఒక్కో ఉద్యోగానికి 3వేల మంది పోటీ

రాష్ట్రంలో ఒక్కో ఉద్యోగానికి 3వేల మంది ఉద్యోగులు పోటీ పడుతున్నారు.. గత ప్రభుత్వం ఖాళీ అయిన ఉద్యోగాలనే భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పరకాల పట్టణంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ప్రారంభించి, ఉద్యోగాలు దక్కించుకున్న అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను మంత్రి అందజేసి మాట్లాడారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీ, అన్ని జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరకాల, హనుమకొండ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్‌లు ప్రావీణ్య, సత్యశారద, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, డీఆర్‌డీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పరకాల నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాల ద్వారా 51 బ్యాచ్‌లలో 1,717 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసుకున్న 82 మంది మహిళలకు మంత్రి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ పత్రాలు అందజేశారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడుతుంది.. ప్రతీ విద్యార్థిని తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్‌కు చెందిన ఎస్‌ఆర్‌ఐ మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్‌మాస్టర్ గూడూరు సుధాకర్(బ్రూస్) శుక్రవారం హనుమకొండ ఇండోర్ స్టేడియం లాన్‌టెన్నిస్ కోర్టులో విద్యార్థినులకు ఆత్మరక్షణ మెలకువలు నేర్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ ప్రావీణ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు. అనంతరం నాయిని మాట్లాడుతూ.. బాలికలపై జరుగుతున్న ఆకృత్యాల నేపథ్యంలో వారి భద్రత కోసం పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వాలని, ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కోరారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉంటేనే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎండీ అజీజ్‌ఖాన్, యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్, పారిశ్రామికవేత్త వేణుచౌహాన్, డీఎస్ఏ కోచ్‌లు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి రమేష్, కొత్త ప్రశాంత్, మహ్మద్ అఫ్జల్, బత్తిని జీవన్‌గౌడ్, దేవరకొండ ప్రభుదాస్ పాల్గొన్నారు.